



నారాయణపేటలో రాస్తారోకో చేస్తున్న రైతులు

గన్నీ బ్యాగుల కోసం రాస్తారోకో

నారాయణపేట/నర్వ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): గన్నీ బ్యాగుల కోసం రైతులు మరోమారు నారాయణపేట జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ముందు అంతర్రాష్ట్ర రహదారిపై ఆదివారం ఉదయం రాస్తారోకో చేశారు. బ్యాగుల కోసం ఆరు రోజులుగా నారాయణపేట సింగిల్ విండో కార్యాలయానికి వెళ్తున్నా ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాగులు లేవని, వస్తే ఇస్తామని అధికారులు చెబుతూ కాలయాపన చేయడం చేస్తున్నారని అన్నారు. రాస్తారోకోతో రహదారిపై వాహనాల రాకపోకలు స్తంభించాయి. పోలీసులు అక్కడికి చేరుకుని, రైతులను శాంతింపజేశారు. బ్యాగులు ఇప్పిస్తామని నచ్చజెప్పి సింగిల్‌విండో కార్యాలయం వద్దకు తీసుకెళ్లారు. పదకొండు గంటల ప్రాంతంలో సింగిల్‌విండో కార్యాలయానికి వచ్చిన 10 వేల గన్నీ బ్యాగులను రైతులకు అందించారు.

జన జాతర

- శ్రీరామకొండకు పోటెత్తిన భక్తులు
- ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు
- దర్శించుకున్న ఎంపీ డీకే అరుణ




ఎండ తగలకుండా ఏర్పాటు చేసిన షేడ్‌నెట్

కోయిలకొండ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని కోయిలకొండలోని స్వయం భూ రామపాద క్షేత్రం శ్రీరామకొండ భక్తజన సముద్రంగా మారింది. శనివారం రాత్రి 12 గంటల నుంచి భక్తులు స్వామి దర్శనం కోసం బారులు తీరారు. తెల్లవారుజామున స్వామికి పూజారులు ఫల పంచామృత అభిశేకం, అర్చనలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దాదాపు 4 గంటల పాటు లైన్‌లో వేచి ఉండి, దర్శించుకొన్నారు. ఎండను లెక్క చేయకుండా రామకొండకు భక్తులు పోటెత్తారు. దర్శనం అనంతరం మహిమాన్వితమైన కొనేరు నీరు, కొండపై ఉన్న వనమూళికలను వెంట తీసుకెళ్లారు. స్వామిని ఎంపీ డీకే అరుణ సందర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. రామకొండ ఆలయ అభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. శ్రీరామకొండ చైర్మన్ రవీందర్‌రెడ్డి, నాయకులు నాగురావు నామాజీ, రతంగ్ పాండురెడ్డి, సత్యయాదవ్, శ్రీనివాస్‌రెడ్డితోపాటు పలువురు నాయకులు స్వామిని దర్శించుకున్నారు.



ఆలయం ఆవరణలో పాలమూరు ఎంపీ డీకే అరుణ



రామకొండ వద్ద స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

పైసల్ పడ్తలేవ్

- 15 రోజుల కిందట ధాన్యం విక్రయించిన రైతులు
- ఇంత వరకు రైతుల ఖాతాల్లో జమ కాని నగదు
- డబ్బుల కోసం అన్నదాతల ఎదురుచూపులు
- ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం 32వేల మెట్రిక్ టన్నులు
- రూ.75 కోట్లకు గాను చెల్లించింది రూ.8 కోట్లు...
  పెండింగ్‌లో రూ.64 కోట్లు

7



వనపర్తి జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో ధాన్యం తూకం చేస్తున్న హమాలీలు(ఫైల్)

తల్లడిల్లుతున్న ప్రజలు

- జిల్లాలో 43 డిగ్రీలు నమోదవుతున్న ఉష్ణోగ్రత
- రోజురోజుకు పెరుగుతున్న వడదెబ్బ బాధితులు
- ఇప్పటికే నమోదైన 300 కేసులు
- పీహెచ్‌సీలలో అందుబాటులో మందులు
- కూలీలకు అందజేస్తున్న ఓఆర్ఎస్ ప్యాకెట్లు



జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు(ఫైల్)

గద్వాలక్రైం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భానుడి ప్రతాపం రోజురోజుకు ఉగ్రరూపం దాల్చుతోంది. నిన్న మొన్నటి దాకా దాదాపు 38 డిగ్రీలు ఉన్న ఉష్ణోగ్రత నాలుగు రోజులుగా జోగుళాంబ గద్వాల జిల్లాలో ఏకంగా 43,44 డిగ్రీలు నమోదైంది. రానున్న మరో 3 రోజుల్లో ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే జిల్లాలో ఇప్పటికే వడదెబ్బతో ఎంతో మంది ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. రోజురోజుకు ఈ వడదెబ్బ బాధితులు పెరుగుతున్నారే తప్ప తగ్గడంలేదు. వడదెబ్బ విషయంలో ప్రజలు జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదం తప్పదని వైద్యాధికారులు చెబుతున్నారు.

జిల్లాలో ఇప్పటికే 300 మంది వడదెబ్బతో చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు ప్రాణాపాయం జరగలేదని, కానీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు చెబుతున్నారు. ఈ వడదెబ్బ బాధితులు ముఖ్యంగా పట్టణంతో పాటు రాజోలి, శాంతినగర్, అయిజ, మల్దకల్, గట్టు, కేటీదొడ్డిలోని తదితర గ్రామాలలో ఎక్కువగా ఉన్నారు. వీరిలో కొందరు ఇంకా జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా మరికొందరు ప్రవేట్ ఆసుపత్రిలతో చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది.

అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు..

జోగుళాంబ గద్వాల జిల్లాలోని పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్‌సెంటర్లు, ఎంసీహెచ్ సెంటర్, పీపీ యూనిట్, జిల్లా ఆసుపత్రిలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉన్నాయి. ఇంకా వేసవి కాలం ప్రారంభం కంటే ముందే అన్ని మందులను అందుబాటులోకి తెచ్చామన్నారు. వడదెబ్బ బాధితులకు ఎల్లవేళలా చికిత్సలు అందించేలా చూస్తున్నామని వైద్యాధికారులు తెలిపారు. అలాగే ఉపాధి హామీ కూలీలకు వడదెబ్బకు గురికాకుండా ఎండవేడిమికి ఇబ్బందులు పడకంగా వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు మందులను కూడా సరఫరా చేస్తున్నారు.

అవగాహన కల్పించడంలో విఫలం

పెరుగుతున్న ఎండల దృష్టా వైద్యాధికారులు ప్రజలకు వడదెబ్బపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ముఖ్యంగా జిల్లాలోని పీహెచ్‌సీ సెంటర్లలో ఈ అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో ఆయా మండలాలు, గ్రామాలలో ఉన్న ప్రజలు అప్రమత్తమై వడదెబ్బ బారిన పడకుండా ఉంటారు. కాని జిల్లా వైద్యాధికారుల నిర్లక్ష్యంతో ఎక్కడ కూడా వడదెబ్బపై అవగాహన కల్పించడం లేదు. దీంతో రోజురోజుకు వడదెబ్బ బాధితులు ఎక్కువ అవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారులు స్పందించి గ్రామాలలో, పట్టణాలలో వడదెబ్బ బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ఎండవేడిమికి తలపై కొంగు కప్పుకొని వెళ్తున్న మహిళలు

ప్రథమ చికిత్స ఇలా..

వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడగల ప్రదేశానికి చేర్చాలి. తడిగుడ్డతో శరీరం తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు ఇలా చేయాలి. చల్లని గాలి తగిలేలా చూడాలి. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ ద్రావణంలేదా ఓరల్‌రీహైడ్రేషన్ ద్రావణం తాగించాలి. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదు. ప్రథమచికిత్స అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాలి.



స్వామికి పూజలు చేస్తున్న పూజారి



క్రిష్ణ మండలం ఖాన్‌దొడ్డిలో పిడుగు పాటుకు మృతి చెందిన ఆవు వద్ద రోదిస్తున్న రైతు కుటుంబం

వర్షం.. నష్టం

- మక్తల్ మండలంలో పిడుగు పాటుకు ఇద్దరి మృతి
- గద్వాల, మల్దకల్‌లలో ఆరు పశువులు, 15 గొర్రెలు.. మృత్యువాత
- తడిసిన ధాన్యం

నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో ఆదివారం కురిసిన అకాల వర్షం అపార నష్టం మిగిల్చింది. పిడుగు పాటుకు నారాయణపేట జిల్లాలో ఇద్దరు మృతి చెందారు. రెండు జిల్లాల్లో పదుల సంఖ్యలో పశువులు, గొర్రెలు చనిపోయాయి. కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోవడంతో రైతు లబోదిబో మంటున్నాడు చాలా చోట్ల చెట్లు విరిగి పడగా, విద్యుత్ స్తంభాలు నేల కూలాయి.

-ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్

6



క్రిష్ణ మండలం ఖాన్‌దొడ్డిలో పిడుగు పాటుకు మృతి చెందిన ఆవు వద్ద రోదిస్తున్న రైతు కుటుంబం

గోవిందా.. గోవిందా

- కురుమూర్తి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

చిన్నచింతకుంట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పేదల తిరుపతిగా పేరుగాంచిన కురుమూర్తి వేంకటేశ్వరస్వామి క్షేత్రానికి ఆదివారం అమావాస్య సందర్భంగా భక్తులు పోటెత్తారు. ఆలయ 350 మెట్లకు బొట్లు పెట్టి, టెంకాయలు కొట్టి, దీపాలు వెలిగించారు. ప్రత్యేక పూజలు చేశారు. స్వామి రాజగోపురం ఎదుట భక్తులు పెద్ద ఎత్తున దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణ మారుమోగింది. జాతర మైదానంలో భక్తులు కిటకిటలాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద కొనుగోలుదారులతో సందడి నెలకొంది.



స్వామిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

అందని న్యూట్రిషన్ కిట్లు

- గర్భిణులు, బాలింతల ఎదురుచూపులు
- నిలిచిన నగదు ప్రోత్సాహకాలు



ఖిల్లాఘణపురం సామాజిక ఆరోగ్య కేంద్రం

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నిధుల లేమితో ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణులకు, మహిళలకు అందించే న్యూట్రిషన్ కిట్లు నిలిపివేశారు. గత ప్రభుత్వంలో ప్రసవాలను ప్రోత్సహించేందుకు తల్లీబిడ్డకు 21 వస్తువులతో కూడిన మాత శిశు ఆరోగ్య కిట్ల పంపిణీ చేసేవారు. ప్రస్తుతం గర్భిణులకు 6, 9 మాసాల్లో అందించే న్యూట్రిషన్ కిట్ల సరఫరా, గర్భిణులు, బాలింతలకు అందించే ప్రోత్సాహకాలు దూరమయ్యాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలకు వచ్చిన మహిళల బంధువులు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలపై వైద్యులను, అధికారులను నిలదీస్తే సమాధానం దాటవేస్తున్నారు. మహిళలకు అందించే కిట్లతో పాటు ప్రోత్సాహక నగదు నిధులు ఎప్పుడు ఇస్తారోనని గర్భిణులు, బాలింతలు ఎదురుచూస్తున్నారు.

గర్భిణులకు అందని పౌష్టికాహారం

మాతా శిశు మరణాలను తగ్గించాలని రక్తహీనత నుంచి గర్భిణులను రక్షించడానికి ప్రభుత్వం పౌష్టికాహారం నిమిత్తం న్యూట్రిషన్ కిట్ అందించేది. న్యూట్రిషన్ కిట్‌లో హార్లిక్స్ పల్లి పట్టీలు, ఖర్జూరాలు, నెయ్యి తదితర పదార్థాలు ఉండేవి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు, జీజీహెచ్‌లో పేర్లు నమోదు చేసుకున్న గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేసేవారు. ప్రస్తుత ప్రభుత్వం కిట్ల పంపిణీకి మంగళం పాడింది.

ఎంసీహెచ్, న్యూట్రిషన్ కిట్ల సరఫరా లేదు



రాష్ట్ర ప్రభుత్వం నుంచి న్యూట్రిషన్ కిట్ల సరఫరా నిలిచిపోవడంతో ఆసుపత్రిలో పంపిణీ చేయడం లేదు. ప్రభుత్వం నుంచి కిట్లు వచ్చిన వెంటనే అర్హులైన గర్భిణులు, బాలింతలకు అందజేస్తాం. ప్రోత్సాహక నిధులు సైతం ప్రభుత్వం నుంచి విడుదల కాలేదు. నిధుల లేమీతో ప్రభుత్వ పథకాలకు అంతరాయం కలుగుతుంది.

- డాక్టర్ శ్రీనివాసులు, డీఎంహెచ్‌వో, వనపర్తి





అచ్చంపేట పట్టణంలోని హోటళ్లను తనిఖీ చేస్తున్న జిల్లా ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ మనోజ్ కుమార్ (ఫైల్)

సారూ.. ఇటు చూడండి

- కుళ్లిన ఆహారం విక్రయిస్తున్న హోటళ్లు
- బోటి కూరలో ఎలుక
- ఫిర్యాదు చేస్తేనే తనిఖీలు
- ఏడాదిలో 14 కేసులు

అచ్చంపేటటౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): భోజనం బయట తినాలని ప్లాన్ చేస్తున్నారా.? అయితే జర జాగ్రత.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, మండీలు, కాఫీ షాప్‌లు అపరిశుభ్రతతో దర్శనమిస్తున్నాయి. సాధారణ హోటళ్లతో పాటు రెస్టారెంట్లలోనూ ఇదే దుస్థితి ఉంది. ఆకర్షణీయ రంగులు, వేడివేడిగా వడ్డిస్తున్నారు అనుకుంటున్నాం.. కానీ కొన్ని హోటళ్లలో పాచిపోయిన మాంసం వేడిచేసి వడ్డించినా లొట్టలేసుకొని తింటున్నాం. శనివారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలతో పలు విషయాలు వెలుగుచూశాయి. బాగా పేరొందిన రెస్టారెంట్లు, కాఫీ షాపులు, బేకరీల్లోనూ అపరిశుభ్రమైన వంటశాలలు.. పాచిపోయిన ఆహార పదార్థాలను అధికారులు గుర్తించారు. దీంతో అధికారులు తనిఖీలు చేసి పలు ఆహార పదార్థాల శాంపిళ్లు తీసుకెళ్లారు. ఏడాది కాలంలో జిల్లాలో మొత్తం 14 కేసులు నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. వాటిలో 9 కేసులకు అదనపు కలెక్టర్ రూ 90వేల జరిమానా విధించారు.

ప్రజల జీవితాలతో చెలగాటం..

హోటళ్లు, రెస్టారెంట్ల యాజమానులు సంపాదనే ధ్యేయంగా ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. హోటళ్లలో తినాలంటే భయపడేలా ఇటీవల తనిఖీలలో పలు అంశాలు బయటకు వచ్చాయి. పది రోజుల క్రితం పట్టణంలోని రెస్టారెంట్‌లో ఫుడ్‌అర్డర్ చేసుకున్న వ్యక్తికి పాచిపోయిన ఆహారం ఇవ్వడంతో అధికారులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం పట్టణంలోని రెస్టారెంట్‌లో బోటికూర అర్డర్ చేసుకొని ఇంటికి తీసుకెళ్తే అందులో చనిపోయిన ఎలుక దర్శనమిచ్చింది. ఆయన అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు శనివారం తనిఖీలు చేశారు. నిత్యం హోటళ్లలో తనిఖీలు నిర్వహిస్తే ఇలాంటి సంఘటనలు జరగవని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

తనిఖీలు చేస్తున్నాం..

జిల్లాలోని హోటళ్లను నెలకోసారి క్రమం తప్పకుండా తనిఖీలు చేస్తున్నాం. అపరిశుభ్రంగా ఉన్న హోటళ్ల యజమానులపై చర్యలు తీసుకుంటాం. ఏడాది కాలంలో 14 కేసులు నమోదు చేశాం. ఎంతటి వారైన ఉపేక్షించేదిలేదు.

- మనోజ్ కుమార్, జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్



ఫ్రిజ్‌లో నిల్వఉన్న పదార్థాలను పరిశీలిస్తున్న అధికారి (ఫైల్)

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 12 తులాల బంగారు నగలు అపహరణ
- జడ్చర్ల అశోక్ నగర్‌లో ఘటన

7

త్వరలో వాలీబాల్ అకాడమీ

- ఈ విద్యా సంవత్సరంలోనే ప్రారంభం
- అనుమతించిన రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ
- జూలైలో క్రీడాకారుల ఎంపిక

7


నారాయణపేటలో వరి చేను కోస్తున్న యంత్రం

జోరందుకున్న వరి కోతలు

● జిల్లా వ్యాప్తంగా 1,36,000 ఎకరాల్లో వరి సాగు

నారాయణపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా కృష్ణానది పరివాహక ప్రాంతాలతో పాటు బోర్లు, చెరువుల కింద ప్రస్తుత యాసంగిలో సాగైన వరి పంటల కోతలు జోరందుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా యాసంగిలో 1,36,000 ఎకరాల్లో వరి సాగు చేయగా అందులో సన్న రకం 1,08,000 ఎకరాల్లో, దొడ్డురకం 28వేల ఎకరాల్లో సాగుచేశారు. ముఖ్యంగా సాగునీటి వసతి గల సంగంబండ, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులతో పాటు కృష్ణానది పరివాహక ప్రాంతంలో కంకులతో కోతదశకు చేరుకుని కోతలు ఊపందుకున్నాయి. మే నెల రెండో వారం వరకు పూర్తి కానున్నాయి. జిల్లాలో వరి కోతల మిషన్లు గంటకు పోర్ వీల్స్‌కు రూ.2,800, టూ వీల్స్‌కు రూ.2,500 వరకు అద్దె తీసుకుంటున్నారు. జిల్లాలోని 13 మండలాల్లో ప్రస్తుత యాసంగిలో 100 కేంద్రాలకు గాను 89 కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైయ్యాయి. 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని సివిల్ సప్లయ్ శాఖ అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. కొనుగోలు కేంద్రాల ద్వారా క్వింటాల్ మద్దతు ధర గ్రేడ్-ఏకు రూ.2,320, గ్రేడ్-సీకి రూ. 2,300కు కొననున్నారు. సన్న రకం ధాన్యానికి కింటాల్‌పై రూ.500 బోనస్ రైతాంగానికి ప్రభుత్వం చెల్లిస్తుంది.

నేటి నుంచి స్వర్ణ మహోత్సవాలు

నారాయణపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటకొండ నరసాచల భూశ్రీనివాస విగ్రహ ప్రతిష్ఠాపన 50 ఏళ్ల సువర్ణ మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వారం రోజుల పాటు నిత్యం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు భగవత సప్తాహం, స్వామీజీల రాక, సంగీత కచేరీలు, ఆధ్యాత్మిక, ధార్మిక ప్రసంగాలు కొనసాగుతాయి. ఈ ఉత్సవాలను 28 నుంచి మే 4 తేదీ వరకు వైభవోపేతంగా నిర్వహించేందుకు శ్రీభూ శ్రీనివాస నర్సాచల సేవాసమితి ఏర్పాట్లను చేపట్టింది. మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు సోమవారం ఉదయం కోటకొండ గ్రామానికి చేరుకోనున్నారు. సువర్ణమహోత్సవాలు ప్రారంభించి మూలరాముల సంస్థాన పూజ నిర్వహించి భక్తులకు అనుగ్రహబాషన చేయనున్నారు. ఉత్సవాల్లో భక్తులు పాల్గొనాలని సేవాసమితి సభ్యులు సీతారామారావు, జనర్దన్‌రావు కోరారు.


నర్సాచలంలో కొలువు దీరిన భూ శ్రీనివాస విగ్రహాలు

విద్యార్థుల నమోదు పెంచాలి

● ఈ కుబేర్‌లో ఉన్న పెండింగ్ బిల్స్ విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కిష్టయ్య

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపునకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవిప్రసాద్ గౌడ్, సీనియర్ నాయకుడు కిష్టయ్య పిలుపునిచ్చారు. తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మహబూబ్‌నగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో జిల్లా స్థాయి నాయకత్వ ఉద్యమ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ ముగింపు కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై విద్యా, ఉపాధ్యాయ రంగాలు ఎదుర్కొంటున్న సమస్యపై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడాన్ని ఆహ్వానిస్తున్నమన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించాలన్నారు. ప్రవేట్‌కు దీటుగా ముందుగానే విద్యార్థుల నమోదు ప్రక్రియ ప్రారంభించాలన్నారు. ఈ ప్రక్రియలో మొత్తం ప్రభుత్వ యంత్రాంగంతో పాటు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలన్నారు. అప్పుడే విద్యావ్యవస్థ గాడిన పడుతుందన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, వెంకటేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగులకు సంవత్సరన్నర కాలంగా ఈ కుబేర్‌లో పెండింలో ఉన్న అన్ని బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వేతన సవరణ, ఐదు డీఏలు, ఉపాధ్యాయుల బదిలీలు, కేజీబీవీల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు, పదోన్నతులు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ శిక్షణ తరగతుల్లో ఉపాధ్యాయ ఉద్యమ చరిత్ర, శాస్త్రీయ అవగాహన, ఉపాధ్యాయుల పద్ధతులు, సెలవు నిబంధనల అనే అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ తరగతులకు ప్రిన్సిపాల్‌గా ఉమాదేవి వ్యవహరించారు. ఆర్ నర్సింహులు, భాస్కర్, మణ్యం, అజయ్, వేణుగోపాల్, వెంకటయ్య, ఖాదరయ్య, జయంతి పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం సీట్లు కేటాయించాలి

● జాతీయ అఖిల భారత బీసీ సంఘటన సమితి అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్


మాట్లాడుతున్న జాతీయ అఖిల భారత బీసీ సంఘటన సమితి అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్

పాలమూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 42శాతం టికెట్లు కేటాయించాలని జాతీయ అఖిల భారత బీసీ సంఘటన సమితి అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని స్వర్ణకార భవన్‌లో నిర్వహించిన బీసీలకు రాజ్యాధికారం సమగ్రాభివృద్ధి అనే అంశంపై తెలంగాణ బీసీ మహాసభ ఆధ్వర్యంలో బీసీ ప్రముఖుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కుమ్మరి రామచంద్రయ్య అధ్యక్షతన జరిగింది. 21 బీసీ కుల సంఘాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొని ప్రసంగించారు. బీసీ కుల సంఘాలు పరస్పర సహకారంతో మన ఓటు మనకే అను నినాదంతో ఓట్లు చీల్చకుండా బీసీలకే వేసుకోవాలని కోరారు. రాజకీయ పార్టీలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ మేయర్ సీటు బీసీ మహిళకు కేటాయించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే (విశ్వకర్మ రాజు యువశక్తి ముద్ర) వంటి సంక్షేమ పథకాలను అందిపుచ్చుకోవాలని కుల సంఘాలకు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు ఇచ్చే సబ్సిడీ రుణాల్లో బ్యాంకు లోను ముడి పెట్టకుండా ఎలాంటి గ్యారెంటీ లేకుండా రుణాలు ఇచ్చి బీసీల సాధికారతకు జీవనోపాధికి దోహదపడాలని కోరారు. ఆచార్య జయశంకర్ విశ్వకర్మ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి బ్రహ్మయ్యచారి, కార్యదర్శి ప్రదీప్, రాష్ట్ర కార్యదర్శి చంచల రవికుమార్, కృష్ణాజి, రాంశ్రీనివాస్, అచ్చుగట్ల అంజయ్య, లక్ష్మీనారాయణ, యాదవ్, పురుషోత్తం, సారంగి లక్ష్మీకాంత్, బాండేకర్ విశ్వనాథ్, సిద్ధి రామప్ప, రాములు, నాయీ బ్రాహ్మణ సత్యం, హరిప్రకాష్ గౌడ్, సుబ్రహ్మణ్యం, రాజసింహుడు, బోయ నరసింహ, కందమూరి మంజుల, ఉమామాధవి, రమాదేవి, పుష్ప, రాధ పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాష్ట్ర నెట్‌బాల్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మధ్యప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి నెట్‌బాల్ టోర్నీలో పాల్గొనే తెలంగాణ నెట్‌బాల్ జూనియర్ బాల, బాలికల అండర్-16 జట్ల ఎంపికలను ఆదివారం స్థానిక స్టేడియం మైదానంలో నిర్వహించారు. ఎంపిలను రాష్ట్ర నెట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విక్రమాదిత్య రెడ్డి, ఖాజాఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఐదు చోట్ల ఎంపిక చేసి జట్లకు రాష్ట్ర స్థాయి శిబిరం నిర్వహించి, తుది జట్టును ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.


ఎంపిక పోటీలకు హాజరైన క్రీడాకారులు

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలి

మిడ్జిల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇసుక అక్రమ రవాణాను ముందుండి అడ్డుకుంటానని ఎన్నికల ముందు చెప్పిన వారు.. నేడు కొత్తపల్లిలో జరుగుతున్న ఇసుక రవాణాను ఎందుకు అడ్డుకోవడం లేదని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఎన్.రాజేశ్వర్ ప్రశ్నించారు. ఆదివారం మండలంలోని కొత్తపల్లిలో అనుమతుల పేరుతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని గ్రామానికి చెందిన రైతులు టిప్పర్లను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు అక్కడికి చేరుకొని టిప్పర్ల వే బిల్లులను పరిశీలించారు. కొందరు అధికార పార్టీకి చెందిన నాయకుల ప్రమేయంతోనే ఇసుక రవాణా చేపడుతున్నారని మండిపడ్డారు. గతంలో రాత్రివేళలో ఇసుక రవాణా చేపట్టేవారని నేడు రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక రవాణా చేపడుతున్నారని విమర్శించారు. రైతులు శ్రీనివాస్‌రెడ్డి, పాండు, ఆంజనేయులు, రాఘు పాల్గొన్నారు.


టిప్పర్లను అడ్డుకున్న రైతులు, బీజేపీ నాయకులు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

- సీఎం సొంత జిల్లా నుంచి ఉద్యమం ప్రారంభిస్తాం
- బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్

కొల్లాపూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం వహిస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా నుంచి బీసీ ఉద్యమం ప్రారంభిస్తామని అన్నారు. ఆదివారం కొల్లాపూర్ పట్టణంలో గంగమ్మ తల్లి ఆలయంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన సమితి నాయకులు బీసీ కులాల సంఘం నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా అజయ్ కుమార్ యాదవ్, శివార్చక విజయ్ కుమార్, మల్లికార్జున్, శివ శంకర్ యాదవ్ హాజరయ్యారు. అజయ్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ సకల జనుల సమ్మె లాగా 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన సమ్మెలు నిర్వహించినట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా నుంచి బీసీ ఉద్యమం ప్రారంభం అవుతుందని ఆయన స్పష్టం చేశారు. అనంతరం కొల్లాపూర్ నియోజకవర్గ 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన సమితి తాత్కాలిక కమిటీని ఎన్నుకున్నారు.

నాయినోనిపల్లి మైసమ్మకు భక్తుల పూజలు

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో వెలిసిన మైసమ్మ దేవతను భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, గద్వాల, వనపర్తి జిల్లాల నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ ఆదివారం దాదాపు 20వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తుల నుంచి ఆదివారం మైసమ్మ ఆలయానికి హుండీ ద్వారా రూ.55,016, రూపాయలు, టికెట్ల ద్వారా రూ.23,975, మొత్తం 78,991రూపాయల ఆదాయం వచ్చినట్లు ఈవో రామేశ్వర్‌శర్మ, చైర్మన్ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తిమ్మాజిపేటలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తిమ్మాజిపేట, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): 2002-03కు సంబంధించిన బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక జడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా 102మంది విద్యార్థులకుగాను 70మంది విద్యార్థులు కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అదేవిధంగా గురువులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ పాఠశాల అభివృద్ధిలో తాము భాగస్వాములమవుతామని వారు తెలిపారు. పూర్వ విద్యార్థులు రవి, వెంకటేశ్, మాధవులు, లాలునాయక్, కిరణ్‌కుమార్, అఖిల్, శేఖర్, శివ, కవిత, సరిత, జ్యోతి, వీణ, రాధా తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరు వారాంతపు సంతలో కురిసిన భారీ వర్షం..


ఆత్మకూరు సంతలో మడుగును తలపిస్తున్న వర్షపు నీరు


గాలి, వాన దుమారానికి మేడికొండ గ్రామ సమీపంలో మిరప పంటపై టార్పాలిన్ కవర్లు కప్పుతున్న రైతులు,

వర్షం..నష్టం

- గద్వాల, మల్దకల్‌లలో పిడుగు పడి పశువులు, గొర్రెలు మృత్యువాత
- మక్తల్ మండలంలో ఇద్దరి మృతి
- నేలకొరిగిన వృక్షాలు
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- మేకలసోంపల్లిలో ఓ ఇంటిపై పడిన పిడుగు

గద్వాల/గద్వాల టౌన్/మల్దకల్/ధరూర్/ కేటీదొడ్డి/అయిజ/మక్తల్/ఆత్మకూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల, వనపర్తి, నారాయణపేట జిల్లాలలో అక్కడక్కడ ఆదివారం సాయంత్రం గాలి, వాన బీభత్సం సృష్టించింది. గద్వాలలో పిడుగుపాటుకు రెండు గేదెలు, ఒక ఎద్దు, ఆవు, 15 గొర్రెలు మృతి చెందాయి. అనేక వృక్షాలు నేలకొరిగాయి. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గద్వాల మండల కేంద్రంతో పాటు ధరూర్, కేటీదొడ్డి మల్దకల్, గట్టు మండలాల్లో సాయంత్రం గాలి, ఉరుములతో కూడిన వర్షం కురిసింది. దాదాపు 45 నిమిషాల పాటు కురిసిన ఈ గాలి, వానకు కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్‌లు ఎగిరిపోయి ధాన్యం తడిసిపోయింది. రైతులు వాటిని కాపాడుకోవటానికి తీవ్రంగా శ్రమించారు. అయినప్పటికీ ధాన్యం తడిసిపోయింది. కేటీదొడ్డి మండలంలో వేమారెడ్డికి చెందిన రెండు గేదెలు, మల్దకల్ మండల కేంద్రంలో తిమ్మప్పకు చెందిన ఎద్దు పిడుగుపాటుకు మృతి చెందాయి. బిజ్వారం గ్రామంలో పిడుగుపాటుకు ఆలూరు బుడ్డన్నకు చెందిన 15 గొర్రెలు మృతి చెందాయి. అదే మండలంలోని మేకలసోంపల్లిలో రవిప్రకాశ్ ఇంటిపై పిడుగుపడటంతో ఇంటిపై ఉన్న వాటర్ ట్యాంకు ధ్వంసమైంది. ఇంట్లో ఉన్నవారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. గట్టు మండలం చింతలకుంటలో మరోరైతుకు చెందిన ఆవు మృతి చెందింది. గాలి, వాన బీభత్సానికి గద్వాల పట్టణంతో పాటు మల్దకల్, కేటీదొడ్డి మండలాల్లో అనేక చెట్లు నేలకొరిగాయి. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వర్షానికి ధాన్యం తడవటంతో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆరా తీశారు. సివిల్ సప్లయ్ అధికారులతో మాట్లాడి ధాన్యం తడివకుండా టార్పాలిన్‌లు అందించాలని, తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. అయిజ మండంలోని చిన్నతాండ్రపాడు, ఉత్తనూర్, మేడికొండ గ్రామాలతో పాటు అక్కడక్కడ వర్షం కురిసింది. కల్లాల్లో ఉన్న మిరప తడిసింది. మక్తల్ మండలంలో ఆది వారం బలమైన ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం, పిడుగుపాటుతో రైతు, గొర్రెలకాపరి, ఓ ఎద్దు మృతి చెందింది. మక్తల్ పట్టణం, కర్ని గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఉప్పర్‌పల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులు (34), దాదన్‌పల్లిలో గొర్రెలకాపారి కురుమూర్తి(18) పిడుగుపాటుకు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. మక్తల్ మునిసిపాలిటీ పరిధిలోని కొత్తగార్లపల్లి గ్రామానికి చెందిన కర్రోళ్ల లక్ష్మప్పకు చెందిన ఎద్దు పిడుగుపాటుతో మృతిచెందింది. వనపర్తి జిల్లా ఆత్మకూరులో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది.


బూరెడ్డిపల్లిలో బొలెరో వాహనంపై విరిగిపడిన విద్యుత్ స్తంభం


గద్వాల లింగంబాగ్ కాలనీ పాఠశాల వద్ద విరిగిపడిన చెట్టు


ఉమిత్యాలలో పిడుగుపాటుకు మృతి చెందిన ఎద్దు


గద్వాల : బూడిదపాడు గ్రామంలో రోడ్డుపై పడిన భారీ వృక్షాన్ని ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగిస్తున్న పోలీసులు


గద్వాల : కేటిదొడ్డి మండలం కొండాపూర్‌లో పిడుగుపాటుకు మృతి చెందిన గేదెలు


గద్వాల : మల్దకల్ మండల కేంద్రంలో పిడుగుపాటుకు మృతి చెందిన ఎద్దు

క్రైం కార్నర్

బస్సు- బైక్ ఢీకొని వ్యక్తి మృతి


బస్సును ఢీకొన్న ద్విచక్ర వాహనం

గోపాల్‌పేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలో బస్సు, బైక్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన బండారి శేఖర్ (30) పనుల నిమిత్తం బుద్దారం వెళ్లి గోపాల్‌పేటలో తన చిన్నమ్మను కలుసుకుని తిరుగు ప్రయాణంలో బైక్‌పై వనపర్తి వెళ్తున్నాడు. మండల కేంద్రం పరిధిలో ఉన్న గులోనిమిట్ట దగ్గర వనపర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వనపర్తి నుంచి కోడేరు వెళ్తున్నది. మూలమలుపులో చెట్లు, పిచ్చి మొక్కలు ఎక్కువగా ఉండటంతో కనిపించక శేఖర్ బైక్ వేగంగా బస్సుకు వెళ్లి ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికు లు, పోలీసులు అక్కడ చేరుకుని మృతదేహాన్ని వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు, కుమార్తె ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నవాబ్‌పేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం సాకల్‌పల్లికి చెందిన మల్కమ్మ ఇంటికి తాళం వేసి ఇతర ప్రాంతానికి వెళ్లగా షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా కాలిపోయింది. గమనించిన ఇరుగు పొరుగు వారు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో ఇంట్లో ఉన్న రూ.2 లక్షల నగదుతో పాటు, బియ్యం, బట్టలు దగ్ధమయ్యాయి. చౌడాపూర్ మండల ఆర్ఐ లింగప్ప ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పేద కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్థులు శేకర్ తదితరులు ప్రభుత్వాన్ని కోరారు. బాలకిష్టమ్మ భర్త మరణంతో వచ్చిన రైతు బీమ డబ్బులు పూర్తిగా దగ్ధం కావడం గ్రామస్థులను కలవర పర్చింది.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 12 తులాల బంగారు నగలు అపహరణ


జడ్చర్లలోని అశోక్‌నగర్‌లో శ్రీనివాసమూర్తి ఇంట్లో బీరువాను పగులగొట్టి వస్తువులను చిందరవందరంగా పడేసిన దొంగలు

జడ్చర్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల మునిసిపాలిటీలోని హౌసింగ్‌బోర్డు సమీపంలోని అశోక్‌నగర్ కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాల మేరకు... తన కుమార్తెను హైదరాబాద్‌లో వదిలిపెట్టేందుకు శనివారం రాత్రి దాదాపు 7.30 గంటల సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో సూపరవైజర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసమూర్తి ఇంటికి తాళం వేసి వెళ్లారు. తిరిగి రాత్రి 12గంటల 45 నిమిషాలకు జడ్చర్లకు చేరుకున్నారు. ఇం టికి వేసిన తాళం విరగ్గొట్టి ఉండడం, బీరువా పగులగొట్టి, వసువులు చింద ర వందరగా ఉండటంతో చోరీ జరిగిందని గుర్తించాడు. వెంటనే 100 డయ ల్‌కు సమాచారం చేరవేశాడు. బీరువాలో దాచిన దాదాపు 12తులాల బంగా రు నగలు చోరీ అయ్యాయని శ్రీనివాసమూర్తి ఈ సందర్భంగా పోలీసుల కు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి అర్ధరాత్రి జడ్చర్ల సీఐ కమలాకర్ తన సిబ్బందితో వెళ్లి, ప్రాథమిక విచారణ చేపట్టారు. అనంతరం ఆదివారం ఉదయం క్లూస్‌టీంతో దర్యాప్తు చేయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడ్తున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు.

బావిలో పడి వృద్ధుడి మృతి

మూసాపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తుగా వ్యవసాయ బావిలో పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన అడ్డాకుల మండలం కందూరులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళ్లగా మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం కందూరు గ్రామానికి చెందిన జనిగే రాములు(60) అనే వృద్ధుడు గ్రామశివారులోని ఓ వ్యవసాయ బావి వద్ద కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లగా ప్రమాదవశాత్తుగా నీటిలో పడి మృతి చెందాడు. గమనించిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు మృతదేహాన్ని బయటికి తీశారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆకస్మిక మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మిడ్జిల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలో కొత్తపల్లి గ్రామ శివారులోని రెడ్డిగూడ కమాన్ వద్ద 167 జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని రేవల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఎంసెట్ కోచింగ్ పూర్తి చేసుకున్న తన కూతురు ప్రణితను తీసుకొని రేవల్లి గ్రామానికి తన ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కొత్తపల్లి గ్రామ శివారులోని రెడ్డిగూడ కమాన్ వద్ద ముందు వెళుతున్న రోడ్డు పనులు చేపడుతున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో శ్రీనివాసులు ముఖానికి బలమైన గాయాలైనట్లు తెలిపారు. వెంటనే క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సాతర్లలో వేణుగోపాలస్వామి

మూలవిరాట్ వెండి తొడుగు చోరీ


సాతర్లలోని వేణుగోపాలస్వామి మూలవిరాట్

ఇటిక్యాల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలంలోని సాతర్ల గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో మూలవిరాట్ యొక్క వెండితొడుగు అపహరణకు గురైనట్లు గ్రామస్థులు తెలిపారు. ఆదివారం ఉదయం ఆలయంలో పూజా కార్యక్రమాల కోసం వెళ్లిన భక్తులు స్వామివారికి ఉన్న వెండితొడుగు కనిపించక పోవటంతో ఇది గమనించిన భక్తులు ఆలయ పూజారికి తెలియ చేశారు. ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. బరువు మూడున్నర కిలోలు ఉందన్నారు. 2019లో మాజీ సర్పంచు జయచంద్రారెడ్డి బహూకరించినట్లు తెలిపారు. ఈ విషయమై ఎస్ఐ వెంకటేష్‌ను వివరణ కోరగా విచారిస్తున్నామని తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మల్దకల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పెద్దపల్లి-పావనంపల్లి గ్రామాల శివారులో కోళ్లఫారం వద్ద ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి(38) మృతదేహం లభ్యమైంది. ఈ విషయాన్ని అటుగా వెళుతున్న స్థానికులు గుర్తించి మల్దకల్ ఎస్ఐ నందీకర్‌కు సమాచారం అందించారు. వెంటనే ఎస్ఐ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించిన అ నంతరం పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎవరైనా మృతదేహాన్ని గుర్తించినట్లయితే 8712670295 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు.

పైసల్ పడ్తలేవ్!

» 15 రోజుల కిందట ధాన్యం విక్రయించిన రైతులు
» ఇంత వరకు రైతుల ఖాతాల్లో జమ కాని నగదు
» డబ్బుల కోసం అన్నదాతల ఎదురుచూపులు
» ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం 32వేల మెట్రిక్ టన్నులు
» రూ.75 కోట్లకు గాను చెల్లించింది రూ.8 కోట్లు... పెండింగ్‌లో రూ.64 కోట్లు


వనపర్తి జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో ధాన్యం బస్తాలను లారీలో ఎక్కిస్తున్న హమాలీలు(ఫైల్)

ధాన్యం డబ్బులు రాలే..



గత 15 రోజులు గడుస్తున్నా ధా న్యం డబ్బులు ఇంకా పడలేదు. గిట్టుబాటు ధరతో పాటు సన్నాలకు క్వింటాల్‌కు రూ.500 వస్తా యని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించినా నా కు ఉన్న మూడు ఎకరాల్లో 65 క్వింటాళ్ల ధాన్యాన్ని మూ లమల్లలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో అ మ్ముకున్నాను. అమ్ముకుని 15 రోజులు గడుస్తున్నది. ఇప్పటి వరకు ధాన్యం డబ్బులు, బోనస్ డబ్బులు రాలేదు. పురుగుల మందులు, విత్తనాల ఖర్చు, వరి కోత యంత్రం వంటి వారికి చెల్లించాల్సి ఉంటుంది. కావునా తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ధాన్యం, బో నస్ డబ్బులు తక్షణమే ఖాతాలో జమ చేయాలని అధికారులను కోరుతున్నాను.

- సహదేవుడు, మూలమల్ల గ్రామం,ఆత్మకూరు

వనపర్తి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు విక్రయించిన ధాన్యం డబ్బుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతున్నది. 15 రోజుల కిందట విక్రయించిన రైతులకు ఇప్పటి వరకు డబ్బులు ఖాతాలో జమ కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు డబ్బులు అడగడానికి వెళ్తే సంబంధిత అధికారులు రకరకాల కారణాలు చెబుతున్నారని మండిపడుతున్నారు. అసలే ఆరుగాలం కష్టపడి కష్టనష్టాలకు ఓర్చి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం అకాల వర్షాలకు తడిసినా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించారు. ధాన్యం విక్రయించి 15 రోజులు అవుతున్నా కూడా నయా పైసా కూడా రైతుల ఖాతాలో జమ కాకపోవడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

అసలే పంటకు నీళ్ల లేక అప్పులు తెచ్చి బోర్లు వేసి పంట పండిస్తే విక్రయించిన ధాన్యాన్ని కూడా సకాలంలో డబ్బులు రాకపోవడంతో రైతాంగం తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.

● 15 రోజులు దాటినా అందని డబ్బులు

ఈ యాసంగి సీజన్‌కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 481 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకుని ఇప్పటి వరకు 369 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కొనుగోలు కేంద్రాల వద్ద ఈ సీజన్‌కు సంబంధించి 3 లక్షల 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 4400 మంది రైతుల నుంచి 32వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఇందుకు గాను వారికి రూ.75 కోట్లు రైతుల ఖాతాలో జమ చేయాలి. కానీ ఇప్పటి వరకు 639 మంది రైతులకు రూ. 8 కోట్లు మాత్రమే చెల్లించారు.

ఇంకా 3761 మంది రైతులకు గాను రూ.67 కోట్లు చెల్లిం చాలి. సకాలంలో రైతుల ఖాతాలో డబ్బులు జమ కాకపోవడంతో పలువురు రైతులు సంబంధిత అధికారులను అడిగితే రకరకాల కారణాలు చెబుతున్నారని మండిపడుతున్నారు.

ఇదే విషయంపై పౌర సరఫరాల శాఖ అధికారులను వివరణ కోరగా ట్యాబ్ ఎంట్రీ సకాలంలో జరగకపోవడంతోనే డబ్బుల విషయంలో ఆలస్యం జరుగుతున్నదని, రైతులు ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, డబ్బులు జమ కాని రైతులకు నాలుగైదు రోజుల్లో వారి ఖాతాలో జమ చేస్తామని చెబుతున్నారు.

వేమూరి కనకదుర్గకు ఘన నివాళి



మహబూబ్‌నగర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ డైరెక్టర్ దివంగత వేమూరి కనకదుర్గకు మహబూబ్‌నగర్ యూనిట్ సిబ్బంది ఘన నివాళి అర్పించారు. ఆదివారం ఆమె చతుర్థ వర్ధంతిని పురస్కరించుకొని యూనిట్ కార్యాలయంలో చిత్ర పటానికి పూలమాల వేసి, సంతాప సూచకంగా రెండు నిముషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ చంద్ర చంద్రశేఖర్‌రెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జి ఎ.తిరుపతయ్య, ప్రొడక్షన్ ఇన్‌చార్జి అనూప్ పాటిల్, సర్క్యులేషన్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్ రావు, సబ్ ఎడిటర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో పడిపోయిన సెల్‌ఫోన్

» ప్రయాణికుడికి అప్పగించిన అధికారులు


ప్రయాణికుడు అశోక్‌కు ఫోన్ అప్పగిస్తున్న కంట్రోలర్ భాస్కర్‌నాయక్, విజిలెన్స్ సెక్యూరిటీ నర్సింహులు

జడ్చర్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సులో పడిపోయిన సెల్‌ఫోన్‌ను తెప్పించి ప్రయాణికుడికి అప్పగించిన సంఘటన ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల కొత్తబస్టాండులో చోటుచేసుకుంది. ఖమ్మం జిల్లాకు చెందిన అశోక్ అనే వ్యక్తి ఉదయం ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు వచ్చాడు. అనంతరం హైదరాబాద్ నుంచి నారాయణపేట వెళ్లేందుకు నారాయణపేట బస్సులో ఎక్కాడు. జడ్చర్ల కొత్తబస్టాండుకు వచ్చిన అనంతరం తన ఫోన్‌ను చూసుకోగా, ఫోన్ ఎక్కడో పడిపోయిందని భావించి, జరిగిన విషయాన్ని జడ్చర్ల కొత్తబస్టాండు కంట్రోలర్ భాస్కర్‌నాయక్, విజిలెన్స్ సెక్యూరిటీ నర్సింహులుదృష్టికి తీసుకువచ్చాడు. దీంతో ఖమ్మం నుంచి హైదరాబాద్ వరకు ప్రయాణించిన టికెట్ ఆధారంగా ఆ బస్సు కండక్టర్ మొబైల్ నెంబరు సేకరించారు. వెంటనే ఆ బస్సు కండక్టర్‌కు ఫోన్ చేసి విషయం తెలిపారు. బస్సులో చూడగా సెల్‌ఫోన్ పడి ఉండడాన్ని గుర్తించారు. ఆ సెల్‌ఫోన్‌ను హైదరాబాద్ నుంచి నాగర్‌కర్నూల్ వెళ్లే ఆర్టీసీ బస్సు కండక్టర్ ద్వారా జడ్చర్ల కొత్తబస్టాండుకు తెప్పించారు. అనంతరం పూర్తి వివరాలను తెలుసుకుని సదరు యజమానికి సెల్‌ఫోన్‌ను అప్పగించారు. కాగా పోయిందనుకున్న తన మొబైల్ తిరిగి చేతికి రావడంతో సంతోషం వ్యక్తం చే స్తూ, ఆర్టీసీ అధికారులకు సదరు ప్రయాణికుడు కృతజ్ఞతలు తెలిపారు.

త్వరలో వాలీబాల్ అకాడమీ

» ఈ విద్యా సంవత్సరంలోనే ప్రారంభం
» అనుమతించిన రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ
» జూలైలో క్రీడాకారుల ఎంపిక


అకాడమీ విద్యార్థుల వసతి కోసం సిద్ధం చేసిన గదులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలో వాలీబాల్ అకాడమీ త్వరలోనే ప్రారంభం కానున్నది. రెండేళ్ల క్రితమే అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అకాడమీని మంజూరు చేసింది. పాలమూరు పట్టణంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) మైదానంలో దీనిని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. విద్యార్థుల ప్రవేశం కోసం రాష్ట్ర స్థాయి ఎంపిక ప్రక్రియను కూడా నిర్వహించింది. వివిధ జిల్లాలకు చెందిన 20 మంది బాలురు, 12 మంది బాలికలను కూడా ఎంపిక చేశారు. కానీ అకాడమీ మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో ఎంపికైన విద్యార్థులు అప్పటి నుంచి ఎదురు చూస్తూనే ఉన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన అనంతరం ప్రభుత్వ క్రీడా సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించడంతో ఎటకేలకు అకాడమీ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. జూలైలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ విద్యా సంవత్సరమే ప్రారంభోత్సవానికి చర్యలు చేపట్టడంతో, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు, క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వంట సామగ్రి, బెడ్లు సిద్ధం

వాలీబాల్ అకాడమీకి అవసరమైన మౌలిక సామగ్రి కోసం డీఎస్ఏ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (సాట్స్)కు ప్రతిపాదనలను పంపించింది. ఆ మేరకు రూ.3.70 లక్షల విలువైన వంట సామగ్రి గత ఏడాదే స్టేడియానికి చేరింది. రూ. 3 లక్షల పైచిలుకు విలువైన 40 మంచాలు వచ్చాయి. పరుపులు, దుప్పట్లు, డైనింగ్ టేబుళ్ల త్వరలో రానున్నాయి. విద్యార్థులకు మెనూ ప్రకారం ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి అందించే పౌష్టికాహారం తదితరాలకు కాంట్రాక్టర్ కోసం అన్వేషిస్తున్నట్లు సమాచారం. అలాగే బాల, బాలికలకు ప్రత్యేక కోచ్‌లను కూడా నియమించాల్సి ఉంది. ఈ ఏర్పాట్లన్నీ త్వరలో పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

రూ.19 లక్షలతో వసతులు..

వాలీబాల్ అకాడమీ ఏర్పాటుకు ప్రభుత్వం రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(సాట్స్) ద్వారా రూ.19లక్షల వరకు నిధులు విడుదల చేసింది. వాటితో మైదానంలో రెండు వాలీబాల్ కోర్టులు సిద్ధం చేశారు. ప్లే ఫీల్డ్ గోడలకు చిత్రాలు కూడా వేశారు. క్రీడాకారులకు వసతి కల్పించేందుకు ఈతకొలను పైఅంతస్తులోని గదులకు మరమ్మతులు చేశారు. బండలు వేసి పెయింటింగ్ వేసి రూంలను సిద్ధం చేశారు.


మైదానంలో సాధన చేస్తున్న క్రీడాకారులు(ఫైల్)

జూలైలో వాలీబాల్ అకాడమీ ఎంపికలు



వాలీబాల్ అకాడమీ ప్రారంభం కాని విషయాన్ని సాట్స్ దృష్టికి తీసువెళ్తాం. రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారులు ఏపీ జితేందర్‌రెడ్డి కృషి వల్ల అకాడమీ ప్రారంభానికి అనుమతి వచ్చింది. ఇక్కడ అకాడమీ ఏర్పాటుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇంకా మిగిలిన సదుపాయాలు త్వరలో ఏర్పాటు చేస్తాం. జూలై మొదటి వారంలో అకాడమీ ఎంపికలు నిర్వహిస్తాం.

- ఎస్.శ్రీనివాస్, డీవైఎస్‌వో, మహబూబ్‌నగర్

భక్తిశ్రద్ధలతో చండీహోమం


చండీహోమంలో పాల్గొన్న భక్తులు

అలంపూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా పేరుగాంచిన పుణ్య క్షేత్రం జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాల్లో ఆదివారం అమావాస్య సందర్భంగా భక్తులు పూజలు చేశారు. ప్రతీ అమావాస్య, పౌర్ణమి, శుక్రవారం రోజున అమ్మవారి ఆలయంలో సామూహిక చండీహోమాలు దేవస్థానం వారు నిర్వహిస్తారు. ఈ చండీహోమాల్లో 288 మంది భక్తులు పాల్గొని ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పూజలు మధ్యాహ్నం 12.30 గంటలకు పూర్ణాహుతితో ముగించారు.

స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక సుదూర ప్రాంతాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. స్వామి వారి ఆలయంలో అభిషేకం, స్పర్శ దర్శనం, అమ్మవారి ఆలయంలో కుంకుమార్చనలు వంటి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి వడి బియ్యం, చీరా గాజులు, త్రిశతి ఖడ్గ మాలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రైవేట్ బస్సు డ్రైవర్‌పై దాడి - కేసు నమోదు

జడ్చర్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల పట్టణంలోని శ్రీనివాసటాకీస్ సమీపంలో ప్రైవేట్ బస్సు డ్రైవర్ పోలే మల్లేష్‌పై అకారణంగా దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపారు. జడ్చర్ల సరస్వతినగర్ కాలనీలో నివాసం ఉంటూ మండలంలోని ఓ ఫార్మా పరిశ్రమ బస్సు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

శనివారం రాత్రి ఫార్మా పరిశ్రమ నుంచి బస్సును జ డ్చర్లకు తీసుకువస్తుండగా పట్టణంలోని శ్రీనివాసటాకీస్ సమీపంలో పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన నాని, వరప్రసాద్‌లు అకారణంగా దాడి చేశారని, దాడిలో తనకు గాయాలయ్యాయంటూ ఆదివారం జడ్చర్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడ్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో

యువకుడి మృతి


మజాహర్ (ఫైల్)

కొల్లాపూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పెంట్లవెల్లి మండలం జటప్రోలు గ్రామానికి చెందిన మహమ్మద్ మజాహర్ (35) ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో సాయికృప ఆసుపత్రి ముందు రెడీమేడ్ బట్టల షాప్ నిర్వహిస్తున్న మజాహర్ ఆదివారం రాత్రి షాప్ మూసి తన సొంత గ్రామమైన జటప్రోలుకు మోటార్ బైక్‌పై వెళ్తున్నాడు. గ్రామ సమీపంలో ఉన్న బ్రిడ్జి వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే యువకుడు మృతి చెందాడు. కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న తోటి మిత్రులు

వంగూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని తుమ్మలపల్లిలో బాల్య మిత్రుడు తిరుపతయ్య మృతి చెందడంతో ఆదివారం 2003 సంవత్సరంలో పదవ తరగతి కలిసి చదువుకున్న తోటి మిత్రులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆ కుటుంబానికి సాను భూతి తెలుపుతూ తోటి మిత్రులు 50 కేజీల బియ్యంతో పాటు రూ, 55 వేలు ఆర్థిక సహాయంను మృతుని భార్య వసంతకు అందజేశారు. నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు.

న్యూస్ బాక్స్

నేడు అచ్చంపేటకు ఎమ్మెల్యే వంశీకృష్ణ రాక

అచ్చంపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య సమస్యతో అచ్చంపేటకు కొంత కాలంగా దూరంగా ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ నేడు నియోజకవర్గానికి వస్తారని ఉమామహేశ్వర ఆలయ చైర్మన్ మాధవరెడ్డి తెలిపారు. ఉదయం ఉమామహేశ్వరంలో ఈశ్వరున్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆయన నియోజకవర్గానికి వస్తున్న క్రమంలో కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు.

నేడు భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు

- తహసీల్దార్ రామకృష్ణయ్య

తిమ్మాజిపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలుతీరుపై నేడు తిమ్మాజిపేటలోని రైతు వేదికలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రామకృష్ణయ్య అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నిర్వహిస్తున్న అవగాహన సదస్సులో కలెక్టర్, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్ రెడ్డి, ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి పాల్గొంటున్నారని తెలిపారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ విస్తరణాధికారులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, మహిళా సంఘాల నాయకులు, రేషన్‌డీలర్లు రావాలన్నారు. గ్రామాలలో రైతులు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా చండీ హోమం

తిమ్మాజిపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అప్పాజీపల్లి శివారులో నరసన్నగుట్టపై స్వయంభువుగా వెలిసిన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం ఆవరణలో ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని ఎంతో భక్తిశ్రద్ధలతో మహాచండీ హోమం నిర్వహించారు. ముందుగా లక్ష్మీనరసింహస్వామికి అభిషేకాలు నిర్వహించి అష్టోత్తర శతనామావళి పఠించారు. అదేవిధంగా ఆంజనేయస్వామి మహాలక్ష్మీ అండాలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా చండీ హోమాన్ని వేద పండితులు కృష్ణమూర్తి శర్మ, గంగాధర శర్మ, హరిశర్మలు జరిపించారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హోమంలో పాల్గొన్నారు.

బీజేహెచ్‌పీఎస్ యువజన జిల్లా అధ్యక్షుడిగా సిద్దార్థ



బీజేహెచ్‌పీఎస్ యూత్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా సిద్దార్థకు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఆ సంఘం రాష్ట్ర నాయకులు

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : బుడగ జంగాల హక్కుల పోరాట సమితి యూత్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఎన్నిక కోసం సమావేశం ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. యూత్ ఫెడరేషన్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు నిడుగొండ సిద్దార్థను ఎన్నుకున్నారు. నాకు ఈ అవకాశం కల్పించినందుకు జాతీయ నాయకత్వానికి, రాష్ట్ర నాయకత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు రాష్ట్ర నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సిరిగిరి మస్నెం, జాతీయ అధ్యక్షుడు కొడిగంటి నరసింహ, జాతీయ ఉపాధ్యక్షుడు యడవల్లి వీరప్ప, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కడమంచి సహదేవుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కళ్లెం శ్రీనివాస్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కళ్లెం మూలస్వామి, ఆ సంఘం కల్చరల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కడమంచి చెన్నయ్య పాల్గొన్నారు.

రోగులకు మందులు పంపిణీ



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు నరేన్, పూర్ణిమ

కొల్లాపూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ పట్టణంలోని గాంధీ ఉన్నత పాఠశాలలో ఆదివారం నాగర్‌కర్నూల్‌కు చెందిన మహావేద్ ఆసుపత్రి 3వ వార్షికోత్సవం సందర్భంగా డాక్టర్ నరేన్, డాక్టర్ పూర్ణిమలు నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. కొల్లాపూర్ పట్టణానికి చెందిన వీరు ఆదివారం కొల్లాపూర్ పట్టణంలోని గాంధీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వైద్య శిబిరంలో 200 మందికి పైగా రోగులను పరీక్షించి వారికి మందులు అందజేశారు. షుగర్, బీపీ వంటి మొండి వ్యాధులతో పాటు చిన్న పిల్లల సమస్యలను వైద్యులు పరీక్షించారు. ఉచితంగా వైద్య సేవలు అందించి ప్రజలకు మెరుగైన వైద్యం అందించిన వైద్యులను కొల్లాపూర్ పట్టణ ప్రజలు అభినందించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

తెలకపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో స్థానిక వంతెన దగ్గర ఆదివారం ప్రమాదం చోటు చేసుకుంది. మామిడికాయలు తీసుకుని వెళ్తున్న వ్యాన్ బ్రిడ్జిపై వెళ్తుండగా పిల్లర్లను ఢీకొట్టింది. దాంతో అప్రమత్తమైన డ్రైవర్ కిందికి దూకి ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. జేసీబీతో వాహనాన్ని రోడ్డుపై తీశారు. బ్రిడ్జిపై రెండు పిల్లర్లు విరిగిపోయాయి. బ్రిడ్జి చాలా పాతది కావడంతో పాటు ఇరుకుగా ఉండడంతో ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొత్తగా బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

అడుగడుగునా...

అడుగులోతు గుంతలు

- రోడ్డును పట్టించుకునే నాథుడే కరువు
- రెండు నియోజకవర్గాల మధ్యలో పట్టించుకోని పాలకులు
- గుంతలతో వాహనదారుల బేజారు

కోడేరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : రెండు నియోజకవర్గాల మధ్యన మరమ్మతుల గురించి పట్టించుకునే వారు లేక ఆ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. వనపర్తి నుంచి పెద్దకొత్తపల్లి మీదుగా లింగాల వరకు వెళ్లే ఈ రోడ్డు మండల కేంద్రమైన ఏదుల నుంచి తీగలపల్లి వరకు దాదాపు మూడు కిలోమీటర్ల రహదారి పూర్తి అధ్వానంగా మారింది. అడుగడుగునా గుంతలు పడినందున వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డు రెండు జిల్లాలు, రెండు నియోజకవర్గాల మధ్యలో ఉండడం వల్ల ప్రజాప్రతినిధులు దృష్టి సారించడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కనిపించని బీటీ

- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

ఉప్పునుంతల : మండల కేంద్రమైన ఉప్పునుంతల నుంచి తాడూరు వరకు 5 కిలోమీటర్ల రోడ్డు బీటీకి నోచుకోవడం లేదు. మండల కేంద్రాని తూర్పు గ్రామాలైన పెనిమిళ్ళ, గువ్వలోనిపల్లి, పిర్వాటోనిపల్లి, వెల్టూరుతో పాటు పలు గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి రావాల్సి వస్తే 5 కిలోమీటర్ల దూరమే అరగంట పైన సమయం పడుతుందని ప్రయాణకులు వాపోతున్నారు. తూర్పు గ్రామాల ప్రజలు తాడురు మీదుగా ఉప్పునుంతలకు వస్తే 15 కిలోమీటర్ల దూరంతో పాటు సమయం ఆదా అవుతుంది. రోడ్డు బాగా లేనందున అచ్చంపేట మీదుగా వెళ్తే 30 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తున్నామని ప్రజలు ఆరోపిస్తున్నారు. బీటీ రోడ్డు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



గుంతల రోడ్డుపై వెళ్తున్న బస్సు

...చెడిపోతున్నాయి. వేల రూపాయిలు రిపేర్లకు పెట్టుకోవాల్సి వస్తుంది. పూర్తిగా కంకర తేలి నడవలేకపోయే పరిస్థితి వచ్చిన తాడురు-ఉప్పునుంతల బీటీ రోడ్డును ఎవరూ పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీ రోడ్డుకు రెన్యూవల్ పనులు చేపట్టాలి.

- బ్రహ్మచారి, కాకునూర్

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి



రోడ్డు పూర్తిగా శిథిలావస్థలో ఉండటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మూడు కిలోమీటర్ల ఈ రోడ్డు మరమ్మతు చేస్తే అచ్చంపేట, లింగాల, పెద్దకొత్తపల్లి, వనప ర్తి వెళ్లడానికి కనీసం 40 నుంచి 50 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. అధికారులు, ప్రజాప్రతి నిధులు స్పందించి రోడ్డు మరమ్మతు వెంటనే చేయాలి.

- బాల్‌రెడ్డి, రైతు, తీగలపల్లి

ఆర్‌అండ్‌బీలోకి కన్వర్టు కోసం ప్రతిపాదన పంపాం

ఏదుల వయా తీగలపల్లి, పెద్దకొత్తపల్లి రోడ్డు ప్రస్తుతం పీఆర్ పరిధిలో ఉన్నదని, దానిని ఆర్ అండ్‌బీకి కన్వర్టు చేసి రోడ్డు నిర్మాణం కోసం కొత్తగా ప్రపోజల్ పంపాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు ఆర్‌అండ్‌బీ నుంచి ఈ రోడ్డు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే రోడ్డు మరమ్మ తులు చేపడుతాం.

- ఎన్.పర్వతాలు, ఆర్‌అండ్‌బీ ఏఈ



కంకర తేలిన ఉప్పునుంతల - తాడురు బీటీ రోడ్డు

ఐదేళ్లుగా కంకర రోడ్డుపై ప్రయాణం



ప్రతీ పనికి మండల ఆఫీసుతో ముడి పడి ఉండడంతో ఐదేళ్లుగా కంకర రోడ్డుపై ఉప్పునుంతలకు ప్రయాణం చేస్తున్నాం. ద్విచక్ర వాహనాలు చెడిపోతున్నాయి. ...

ప్రభుత్వానికి ఎస్టిమేట్ పంపించాం

ఉప్పునుంతల- తాడురు బీటీ రోడ్డు రెన్యూవల్ పనులకు ప్రభుత్వానికి ఎస్టీమేట్ పంపించాం. స్క్రూట్నీ జరుగుతోంది. త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తయితే బీటీ రోడ్డు పనులు చేపడతాం.

- మహేష్, పీఆర్ ఏఈ

ఇంటర్ విద్యార్థులకు మహేంద్రనాథ్ స్మారక పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో డీఐఈవో జి.వెంకటరమణ, ఐక్యత సమాజం సంస్థ వ్యవస్థాపకుడు పుట్టపాగ రవీంద్రనాథ్

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ వార్షిక ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన పలువురు ప్రభుత్వ కళాశాలలకు విద్యార్థులు దివంగత పుట్టపాగ మహేంద్రనాథ్ స్మారక విద్యా పుస్కారాలు-2025 అందుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో సమావేశం మందిరంలో ఐక్యత సమాజ సంస్థ వ్యవస్థాపకుడు, కర్ణాటక విశ్రాంత డీజీపీ డాక్టర్ పుట్టపాగ రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఇంటర్ విద్యా నోడల్ అధికారి జి.వెంకటరమణ చేతుల మీదుగా పురస్కారాలు అందజేశారు. పురస్కారాలు అందుకున్న విద్యార్థుల్లో సెకండియర్‌లో అచ్చంపేట పి.స్నేహిత(ఎంపీసీ)990 మార్కులు, కల్వకుర్తి జి.భరద్వాజ్(ఎంపీసీ) 984 మార్కులు, కె.నాగక్షిత(సీఈసీ) 945 మార్కులు, కొల్లాపూర్ జి.కుసుమకుమారి (బైపీసీ) 905 మార్కులు ఉన్నారు. అదేవిధం గా ఫస్టియర్‌లో ఎంపీసీలో కొల్లాపూర్ పి.వర్షిణి 469 మార్కులు, జొన్నలబొగుడకు చెందిన పి. అజయ్‌కుమార్ 443 మార్కులు, బైపీసీలో ఎ.ప్రణవి 434 మార్కులు ఉన్నారు. వీరిని జిల్లా ఇంటర్ విద్యా నోడల్ అధికారితో కలిసి పుట్టపాగ రవీంద్రనాథ్ శాలువాతో సన్మానించి మెమెంటోలను అందజేశారు. మంచి మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఐక్యత సమాజ సంస్థ ప్రతినిధులు నర్సింహ, నరసింహులు, బాలరాజు, డాక్టర్ రాఘవులు, న్యాయవాది రాజశేఖర్ పాల్గొన్నారు.

కొండారెడ్డిపల్లిలో ముగిసిన కంటి వైద్య శిబిరం

- సీఎం సోదరుడు కృష్ణారెడ్డి



డాక్టర్‌ను సన్మానిస్తున్న సీఎం సోదరుడు ఎనుముల కృష్ణారెడ్డి

వంగూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : సమాజానికి మంచి పనులు చేపట్టడానికి స్వచ్ఛంద సంస్థలు, మానవతా వాదులు ముందుకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఎనుముల కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని కొండారెడ్డిపల్లిలో హైదరాబాద్‌లోని శంకర నేత్రాలయ, సీఎం రేవంత్‌రెడ్డి తల్లిదండ్రులు ఎనుముల రామచంద్రమ్మ, నర్సింహారెడ్డిల జ్ఞాపకార్థం పది రోజులుగా నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం ముగిసిందని కృష్ణారెడ్డి తెలిపారు. 700 మందికి కంటి అద్దాలు, 210 మందికి కంటి శస్త్ర చికిత్సలు చేశారని పేర్కొన్నారు. పది రోజులుగా వైద్య సేవలను అందించిన డాక్టర్లను కృష్ణారెడ్డి ఈ సందర్భంగా పూలమాల శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ వేమారెడ్డి, ఎనుముల రాజశేఖర్ రెడ్డి, పులిజాల కృష్ణారెడ్డి, రాము, వంశీ, శ్రీకాంత్, జంగయ్య, రాఘవేందర్, సంతోష్, గోవర్ధన్, వెంకటయ్య పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణ బిల్లుతో ముస్లింలకు మేలు



మాట్లాడుతున్న బీజేఎంఎం అధ్యక్షుడు అప్సర్‌పాషా

- బీజేఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు అప్సర్ పాషా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేంద్రరావు

కందనూలు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఆదివారం వక్ఫ్ సంస్కరణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారతీయ జనతా మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అప్సర్‌పాషా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేంద్రరావు, బీజేఎంఎం జిల్లా అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.వారు మాట్లాడుతూ వక్ఫ్ చట్టం వల్ల ముస్లింలకు ఎంతో ఉపయోగపడుతుందని ఆర్థిక అసమానతలు లేని ముస్లిం సమాజం ఏర్పడుతుందని అన్నారు. కొంతమంది ముస్లింలను తప్పుదారి పట్టించి దీని మీద వ్యతిరేక ఏర్పడేలా చేస్తున్నారని అన్నారు. జేపీసీ మీటింగ్‌లో చర్చించి అందరి ఆమోదంతోనే బీజేపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అమీద్, సాదిక్‌పాషా, సుబ్బారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మాయని శ్రీశైలం, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్‌చారి, టౌన్ ప్రెసిడెంట్ రాము, టౌన్ జనరల్ సెక్రటరీ ప్రమోద్‌కుమార్, ఆఫీస్ సెక్రటరీ చందు, సీనియర్ నాయకులు యాదగిరిరావు, మహిళా నాయకురాలు పద్మ, చంద్రకళ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తాలూకా స్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభం

ఊర్కొండ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాచాలపల్లి గ్రామానికి చెందిన కటికం నరేష్‌గౌడ్ స్మారక తాలూకా స్థాయి క్రికెట్‌ను ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. అంతకుముందు కటికం నరేష్ గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించిన అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు క్రీడాకారులను ఉద్దేశించి మాట్లా డుతూ యువకులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, నేటి యు వత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి భావిభారత పౌరులుగా దేశానికి ఎనలేని సేవలు అందించాల్సిన అవసరం ఉందని అన్నారు. నిర్వాహకులు భాస్కర్, నవీన్‌చారి, మధురెడ్డి, శివారెడ్డి గ్రామస్థులు రమేష్‌గౌడ్, అఖిల్, సతీష్, హరీష్ తదితరులు ఉన్నారు.

బెక్కెరలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమం



కార్యక్రమంలో పాల్గొన్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి

కల్వకుర్తి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి మండల పరిధిలోని బెక్కెర గ్రామంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జైభీమ్, జైబాపు, జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి హాజరై కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రెడ్డి, మల్లెపల్లి జగన్, శ్రీకాంత్‌రెడ్డి, దళపతి గౌడ్, బీస బాలరాజు, వంశీ, భరత్‌రెడ్డి, సుదర్శన్, నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, అర్జున్, శివారెడ్డి, భగవంతు, పరశురాములు ఉన్నారు.

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి : సీఐటీయూ

నాగర్‌కర్నూల్‌టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అవలంబి స్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా మే 20న జరపతలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పదకొండేళ్ల పాలనలో 44 కార్మిక చట్టాలను నాలుగు కోడులుగా విభజించి కార్మిక హక్కులను కాలరాసే ప్రయత్నామే తప్ప ఒరగబెట్టిందేమీ లేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వర్ధం పర్వతాలు, నాయకులు రామయ్య, రాజు, హనుమంతు, వెంకటస్వా మి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు లక్ష్మీ, వసంత, అలివేల, రాధ, రంజాన్‌బీ, వెంకటమ్మ, కృష్ణమ్మ, భాగ్యమ్మ, తిరుపతమ్మ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు ఘన నివాళి



పహల్గామ్ మృతులకు నివాళులర్పిస్తున్న నాయకులు

కల్వకుర్తి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ కల్వకుర్తి పట్టణంలో శివాజీ సేవా సమితి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదం నశించాలి భారత్ మాతాకీ జై అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని యావత్ ప్రపంచం మొత్తం ముక్తకంఠంతో ఖండిస్తుందని శివాజీ సేవా సమితి అధ్యక్షుడు పురం శేఖర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో నాయకులు వివేకానంద, శ్రీధర్, నరేష్‌గౌడ్, కుడుముల శేఖర్‌రెడ్డి, మధు, శ్రీనివాసులు, అంజి, మహేశ్వర్‌రెడ్డి, సిద్దయ్యగౌడ్, రామకృష్ణ, మల్లేష్, శ్రీనివాసులు, సంజయ్, నారాయణ, సాయి కుమార్ ఉన్నారు.

● నాగర్‌కర్నూల్ టౌన్ : జమ్మూకశ్మీర్ పహల్గాం ప్రాంతంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన పర్యాటకులకు ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలో ఫొటోగ్రాఫర్లు నివాళులు అర్పించారు. నాగర్‌కర్నూల్ అసెంబ్లీ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండు కూడలి నుంచి అంబేద్కర్ విగ్రహం వద్దకు కొవ్వొత్తులతో ర్యాలీగా వెళ్లి మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు రమేష్‌చ గోవర్ధన్, నేతాజీగౌడ్, ప్రసాద్, శ్రీకాంత్, రాజు, శేఖర్, శ్రీను, నాగరాజు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఆరోగ్యభద్రత

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : సీఎంఆర్ ఎఫ్‌తో పేదలకు ఆరోగ్య భద్రత చేకూరుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని 10మంది లబ్ధిదారులకు రూ.4 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే తన నివాసంలో అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్య సేవలందించడానికి నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆసుపత్రిని మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు. పేదల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా తాము ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు అయిల్ల శ్రీనివాస్‌గౌడ్, నియోజకవర్గంలోని పలువురు నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొల్లాపూర్ మండలం ముక్కిడిగుండం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు

కొల్లాపూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ముక్కిడిగుండం గ్రామంలో ఆదివారం మహిళా సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ ప్రజాప్రతి నిధులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ప్రారంభించారు. కొల్లాపూర్ మాజీ జడ్పీటీసీ సభ్యుడు హనుమంత్ నాయక్, మాజీ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి రఘుపతి రావు, మాజీ సర్పంచ్ శారదాలోకేష్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ సింగిల్ విండో డైరెక్టర్ దేశవత్ హర్య బొజ్యా, మాజీ ఎంపీటీసీ లోక్యనాయక్, మండల మహిళా సమాఖ్య ఏపీఎం గౌస్, గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కల్వకుర్తి : మండల పరిధిలోని జిల్లెల గ్రామంలో ఆదివారం ధాన్యంకొనుగోలు కేంద్రాన్ని మాజీ సర్పంచ్ జిల్లెల రాములు ప్రారంభించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, బాలజంగయ్య, మహేందర్, రవి, బాలకృష్ణ, పుల్లయ్య, సాయిబాబు, కృష్ణారెడ్డి, బాలరాజు, పాండు, మల్లయ్య, శ్రీశైలం, నరసింహ, రైతులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో ముందుండాలి

- వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు జూలూరి రమేష్‌బాబు



రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి, చలివేంద్రం

కల్వకుర్తి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవలో ప్రతీ ఒక్కరు ముందుండాలని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు, కన్యకాపరమేశ్వరి దేవాలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ జూలూరి రమేష్‌బాబు అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభాగ్యులకు, అనాథలకు సైతం సంఘాలు, మానవ తావాదులు సహకరించడానికి ముందుకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ నాయకులు శేఖర్, కిరణ్‌ప్రసాద్, పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో...

కొల్లాపూర్ : వేసవి కాలంలో పేద ప్రజల దాహార్తి, ఆకలి తీర్చేందుకు రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొల్లాపూర్ పట్టణంలో ఆదివారం అంబలి, చలివేంద్రం ప్రారంభించారు. రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబలి కేంద్రం, చలివేంద్రాలను ఫౌండేషన్ మేనేజింగ్ జాయింట్ ట్రస్టీ జూపల్లి జగన్‌మోహన్ రావు కొల్లాపూర్ సీఐమహేష్ ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి పట్టణానికి పనుల మీద వచ్చే వారందరికీ కూడా ఈ చలివేంద్రం, అంబలి కేంద్రం ఆకలి, దప్పిక తీరుస్తుందని అన్నారు. వేసవి కాలం పూర్తయ్యే వరకు ప్రతీ రోజు నిర్వహిస్తామని ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రస్తుత మాజీ ప్రజాప్రతినిధులు, రత్నగిరి ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపిన మహానేత కేసీఆర్

- మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్
- వరంగల్ బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు తరలిన శ్రేణులు

కల్వకుర్తి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ 25ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవ సభ చరిత్రాత్మకమైందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి దేశంలోనే అగ్రగామిగా నిలిపిన మహానేత కేసీఆర్ అని పేర్కొన్నారు. వరంగల్‌లో జరిగే సభకు కల్వకుర్తితోపాటు నియోజకవర్గంలోని మండలాల అన్ని గ్రామాల నుంచి ప్రత్యేక వాహనాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. జైపాల్‌యాదవ్ వాహనాలను భారీ ర్యాలీతో ప్రారంభించారు. అదేవిధంగా కల్వకుర్తి పట్టణంతో పాటు ఆయా గ్రామాల్లో నాయకులు వాహనాలను ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి కుంటుపడిందన్నారు. ప్రజలంతా బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వెల్దండ మాజీ జడ్పీటీసీ డాక్టర్ విజితారెడ్డి, పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

అచ్చంపేట నుంచి..

అచ్చంపేటటౌన్ : బీఆర్‌ఎస్ 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభకు అచ్చంపేట నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పట్టణంలోని 20వ వార్డులో బీఆర్‌ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ సుదీర్ఘపోరాటం వల్లే తెలంగాణ సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, బీఆర్‌ఎస్‌నాయకులు రమేష్ రావు, అమీనోద్దీన్, ఖాజాబీ, రాంబాబు, నాయకులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ నుంచి..

కొల్లాపూర్ : బీఆర్‌ఎస్ పార్టీ వరంగల్‌లో తలపెట్టిన భారీ బహిరంగ సభకు కొల్లాపూర్ మండలం మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. కొల్లాపూర్ మండల పరిధిలోని ప్రతీ గ్రామం నుంచి ఆర్టీసీ బస్సులలో ప్రైవేటు జీపులలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఆదివారం ఉదయం నుంచే వరంగల్ సభకు బయలుదేరారు. బహిరంగ సభను విజయవంతం చేసేందుకు తాము సభకు తరలి వెళ్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రానికి మరోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం తధ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయలేకపోయిందని హామీలను విస్మరించిందని వారు తెలిపారు.



పట్టణంలోని బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే



కల్వకుర్తి నుంచి తరలుతున్న మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్



కొల్లాపూర్ : చౌటబెట్ల గ్రామం నుంచి తరలి వెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులు